# గౌతమీగాథలు

## ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

# యమ భాష

### ఫిబ్రవరి

స్కూళ్ళకు వార్షికోత్సవాల సీజను.

ఇద్దరు పెద్దమనుషులు ఇన్నీసు పేటలో ఎవరింటి కోసమో వెతుక్కుంటూ తిరిగి తిరిగి ఎట్టకేలకు ఒక ఇంటి గుమ్మం ఎక్కి తలుపు కొట్టారు.

అప్పుడే సాయంత్రం ఎక్కడికో వెళ్ళబోతూ భమిడిపాటి కామేశ్వర్రావు గారు తలుపు తెరుచుకుని బయటికి వచ్చి 'ఎవరికోసం' అన్నారు.

ఆ ఫలానా తానే అని చెప్పి "నడుస్తూ రోడ్డుమీదమాట్లాడుకుందాం" రమ్మన్నారు. పెద్దమనుషు లిద్దరూ అనుసరించారు.

సరిగ్గా— అది ఆయన సుబ్రహ్మణ్య శాస్త్రి గారింటికివెళ్ళి అరుగుమీద కూర్చుని కబుర్లు చెప్పుకునే సమయం.

సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఎదురు చూస్తున్నారు.

కొత్తవారిద్దరితో కామేశ్వర్రావుగారు అరుగుమీదకువెళ్ళి స్తిమితంగా కూర్చుని "అయ్యా, ఇప్పుడు తమరు వచ్చిన పని ఏమిటో చెప్పండి" అన్నారు.

ఇద్దరిలో ఒకరు "మాది వల్లూరు. రేపు 12 తారీఖున మా స్కూలు వార్షికోత్సవం. అందులో ఉపన్యాసానికి తమర్నీ, సుబ్రహ్మణ్యశాస్త్రిగారినీ ఆహ్వానించమని మా హెడ్‌మాస్టరుగారు పంపారు. దయచేసి ఉభయులూ అంగీకరిస్తే కార్యక్రమపత్రాలుఅచ్చువేయించుకుంటాంఅన్నారు.

కామేశ్వర్రావుగారందుకుని "వార్షికోత్సవంలో సెక్రటరీ రిపోర్టు, బహుమతి ప్రదానం, చిల్లర నాటకాలు. వీటితోటే తెల్లారిపోతుంది. ఇంక ఉపన్యాసాలకి చోటేదీ? మీకు శ్రమా, మాకు హైరానా.

ఆ నాటకాలకోసం చిట్టితల్లులూ, చిన్న పిల్లలూ 4 గంటలకే వచ్చి ఎవరికీ ఊపిరాడ నివ్వరు.

కనక వార్షికోత్సవాల్లో సాహిత్యోపన్యాసాలు, పొలేరమ్మ జాతరలో పుస్తక ఖాండాగా రోత్సవం లాంటి వ్యవహారం. కనక ఉపన్యాసాలు పెట్టక లాంఛనంగా కానిచ్చెయ్యండి" అని సలహా యిచ్చారు.

వచ్చినవారిలో రెండో ఆయన "అమ్మమ్మా అలా అనకండి. మీ ఉపన్యాసం కోసం చాలా రోజులనుంచి తహతహ పడుతున్నాం. కనక తప్పక దయ చెయ్యాలి" అన్నాడు. శ్రీపాదవారందుకుని "అంత కుతూహలంగా వుంటే తప్పక వెడదాం. అయితే తర్వాత కార్యక్రమం ఏమిటో అడగండి?" అన్నారు నవ్వుతూ.

కామేశ్వర్రావుగారు సీరియస్‌గా "మా యెడల మీకు అంత 'ఇది' వుంది గనక మాకు చేసే సత్కారం ఏమిటి?" అన్నారు. పెదమనిషి వినగూడనిమాట ఏదో విన్నట్టు వులిక్కిపడి "సత్కారమా అండి. మీ అంత వారికి ఏం చెయ్యగలం? ఏదో దారిఖర్చులు. ఆతిథ్యం" అని నసిగాడు. కామేశ్వర్రావు గారికి చిర్రెత్తుకొచ్చింది.

"మీరు దయతో ఖర్చులిచ్చి బస్సువాళ్ళని, రైలువాళ్ళని సన్మానిస్తున్నారు. బాగుంది. సరే — రెండు గంటలపాటు సభ్యుల్ని ఆనందంలో ఆలోచనలో ముంచెత్తే మాకు వేదిక దిగాక సోడా అడిగే దిక్కైనా వుండదు.

"పందిరిచివర కూచుని గంగిరెద్దు సన్నాయి వాయించే వాడైనా పాతిక రూపాయ లిస్తేగాని రాడు

"అది ఎవరూ వినరు కాని వుండాలి. శుభ లాంఛనం అలాగే వార్షికోత్సవానికి ఇద్దరు బ్రాహ్మణ్యం అవసరం. వారు బాగా మాట్లాడగలిగిన 'నేరానికి' వారు వచ్చి మాట్లాడాలి. లేకపోతే విరసులు.

"ఇదీ తెలుగువారి రసజ్ఞత —

ఇదీ విద్యార్థులకు నేర్పే కవి పండిత పూజ!

పిలిస్తేచాలు పరిగెత్తే మావాళ్ళ ఆత్మ గౌరవం!

ఒకటి చెబుతున్నాను వినండి. మేమే కాదు. ఇంకెవర్ని పిలిచినా 58 రూపాయల విలువ తక్కువ కాకుండా నగదు రూపంలో గాని, వస్తురూపంలోగాని వారి కివ్వండి.

మీరు అవసరమైతే ఏ ఎమ్మెల్యేగారి పార్టీకేనా వందలు ఖర్చు చేస్తారు. కాని ఈ తెలుగుదేశంలో కవి పండితులు కారు చౌక. ఒక పూలదండ చూపిస్తే చాలు పరుగెత్తుకుంటూవస్తారు. రిక్షాఅయినాలేకుండా వెడతారు. గంగిగోవులు. మాట్లాడలేరు.

ఈ స్థితి మారాలి. అంతవరకూ ఏ సభలకు రాము" అని నిష్కర్షగా చెప్పారు.

వచ్చినవారు కొంతసేపు తటపటాయించి, గుసగుసలు పోయి, ఇంకోచోటికి తిరగలేక, సత్కారానికి ఒప్పుకున్నారు.

వల్లూరులో వార్షికోత్సవం అయిదు గంటల కన్నది ఏడు గంటలకు ప్రారంభమయింది.

స్థానిక ఎమ్మెల్యేగారు అధ్యక్షత వహించారు.

ఆయన స్కూలు సంస్థాపకుల్లో ఒక ప్రముఖుని చిత్రం వెల్లడించడం ఆ కార్యక్రమంలో ప్రథమభాగం.

ఆయన చిత్రగత మహానుభావుడి గురించి నాలుగు మాటలు చెప్పి "ఇట్టి ప్రముఖుని చిత్రపటాన్ని బహిష్కరించే భాగ్యం నాకు కలిగినందుకు చాలా సంతోషం" అని చిత్రంమీది రంగుగుడ్డను తొలగించారు. సభలో చప్పట్లవర్షం! వారి బహిష్కారానికో, ఆవిష్కారానికో తెలియలేదు.

సాధారణంగా కామేశ్వర్రావుగారి ప్రసంగం చివరికి ఉంచుతారు. అది ముందయిపోతేసభలోజనంఉండరనిభయం

శ్రీపాదవారు క్లుప్తంగా దేన్ని గురించో మాట్లాడి కూర్చున్నారు. కామేశ్వర్రావు గారు లేచారు. సభలో కలకలం!

"నేను సమృద్ధిగా హాస్యం సరఫరా చేస్తానని మీ ఆశ. చెయ్యలేనని నా నిరాశ. ఎందుచేతనంటే హాస్యం బాగా ఉంటుంది గాని హాస్యం గురించి ప్రసంగిస్తే ఏడిసినట్టుంటుంది.

ఒకచిన్ననాటిముచ్చట జ్ఞాపకంవస్తోంది.

మా వీధిబడి అయ్యవారు, మీది "యమ భాష"రా అనేవారు. మేం తెల్లబోయిచూస్తే "వెధవల్లారా! మీరు రాసింది యకారమో, మకారమో తెలియదు. రెండూ తెలియక పోతే అది యమ భాష అవుతుంది." అని బుర్రమీద ఒక్క టుచ్చుకునేవారు. అదేమిటండీ అంటే యకారానికి ముందుండవలసిన సున్నా నీ తలకాయంత ఉండాలని అర్థం! ఆయన మొట్టికాయ ఇప్పటికీ జ్ఞాపకం— మేం హైస్కూల్లో నిత్యం చూసేదీ దిద్దేదీ అచ్చంగా ఆ యమభాష! నేను ముఖ్యంగా మిమ్మల్ని కోరేదేమిటీ అంటే ఆ యమభాష రాయకుండాఉండడం. తెలుగు అక్షరాలు చాలా అందమైనవి, ముత్యాల్లా. వాటి అందం తెలిసే భాష సగం పట్టుబడ్డట్టే-" అని ఇంకా ఏదో చెప్పబోతూ వుండగా చిటపట మని చినుకులు ప్రారంభమయాయి.

ఆయన చిరునవ్వుతో 'అక్షరాలా మీ వార్షికోత్సవం సార్థకం అయినందుకు చాలా సంతోషం.' అని కూర్చున్నారు

వర్షంతో ఆ వార్షికోత్సవం చల్లగా ముగిసింది,